సాక్షి
అనంతపురం
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దసరా సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ -తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ రాత్రి 10.05 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ (07489) నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరిగి ఈ రైలు 22వ తేదీ ఆదివారం సాయంత్రం 4.35 గంటలకుతిరుపతి జంక్షన్ (07490) నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌కు ఉదయం 4.50 గంటలకు చేరుతుంది.

భూగర్భ జలాల అభివృద్ధి కోసమే కాలువలకు నీరు

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత తక్కువ ఉన్నందున హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరివ్వలేమని హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈ ఎంపీ రమణారెడ్డి తెలిపారు. ఈ ఏడాది జలాశయానికి 105 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని, దామాషా ప్రకారం 16.097 టీఎంసీలు మాత్రమే హెచ్చెల్సీకి కేటాయింపులు చేశారని వివరించారు. మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అవసరాలకు నీటిని కేటాయిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతుల విజ్ఞప్తి మేరకు హెచ్ఎల్ఎంసీ, మిడ్ పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలకు ఈ నెల 20 నుంచి రెండు వారాలు నీరివ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నీరు ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాల అభివృద్ధి మెరుగుపర్చేందుకు మాత్రమేనని తెలిపారు.

20న ఎంటెక్, ఎం ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంటెక్ ప్రోగ్రాం స్పాన్సర్డ్ కేటగిరిలో మిగిలిన సీట్లు భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 20న నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆర్.కిరణ్మయి తెలిపారు. ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో 6 సీట్లు, బ్రిడ్జెస్ అండ్ టన్నెల్స్‌లో 7, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్‌లో 7, పవర్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్‌లో 7, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెఫ్రిజరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్‌లో 7, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్‌లో 7, వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్‌లో 7, కంప్యూటర్ సైన్సెస్‌లో 4, కెమికల్ ఇంజినీరింగ్‌లో నానో టెక్నాలజీలో 7 సీట్లు ఉన్నాయి. ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీలో 6, ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో 7 సీట్లు ఉన్నాయి. స్పాట్ అడ్మిషన్లు పొందే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

పరమ పావనీ పాహిమాం!

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా అంతటా ఆలయాలు అమ్మవారి నామస్మరణతో ప్రతిధ్వనించాయి. చల్లగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. విద్యుద్దీపాల అలంకరణలో ఆలయాలన్నీ నూతన శోభ సంతరించుకున్నాయి.

– అనంతపురం కల్చరల్



అనంతపురం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో నంది వాహనంపై అమ్మవారు

భూ సర్వేలో దూకుడు

మొదటి దశ..

మొత్తం గ్రామాలు : 43
ఎల్‌పీ నంబర్ల జారీ: 33,046
రీ సర్వే చేసిన ఎకరాలు : 1,43,968.04
పాతిన రాళ్లు : 60,575

రెండో దశ..

మొత్తం గ్రామాలు : 40
ఎల్‌పీ నంబర్ల జారీ: 32,701
రీ సర్వే చేసిన ఎకరాలు: 89,237.31
పాతిన రాళ్లు : 53,148

మూడో దశ (ఇప్పటి వరకు)

మొత్తం గ్రామాలు : 27
ఎల్‌పీ నంబర్ల జారీ: 23,425
రీ సర్వే చేసిన ఎకరాలు: 76,782.97
పాతిన రాళ్లు : 10,552



- 3 లక్షల ఎకరాల్లో రీ సర్వే పూర్తి
- 89 వేలకు పైగా ఎల్‌పీ నంబర్ల జారీ
- 1.24 లక్షల రాళ్లతో హద్దుల ఏర్పాటు
- మూడో దశలో 142 గ్రామాల్లో రీ సర్వే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' ద్వారా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియ జిల్లాలో దూకుడుగా సాగుతోంది. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాడు భూముల సర్వే జరిగింది. ఆ తర్వాత ఎటువంటి పురోగతీ లేకపోవడంతో ప్రతి గ్రామంలోనూ భూ వివాదాలు నమోదవుతున్నాయి. భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు వందేళ్ల తర్వాత జగన్ సర్కారు రీ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు తొలి, రెండో విడతలు పూర్తయ్యాయి. తాజాగా మూడో విడత రీ సర్వే జరుగుతోంది. జిల్లాలో మొత్తం 504 గ్రామాలు ఉన్నాయి. తొలి విడత 40, మలి విడత 43 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. మూడో విడతలో 142 గ్రామాల్లో రీ సర్వే చేయాలని లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటి వరకు 27 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యింది.

సర్వే నంబర్లు పాత చరిత్ర

గతంలో ఒకే సర్వేనంబర్‌లో రకరకాల పేరుతో పలువురికి భూములుండేవి. ఇకపై సర్వే నంబర్ల పాత్ర పాత చరిత్రగా మిగిలిపోనుంది. ఇకపై ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) నంబర్లు మాత్రమే ఉంటాయి. ఫలానా వ్యక్తి భూమిని రీ సర్వే చేసిన అనంతరం అక్షాంశ – రేఖాంశాలు గుర్తించడం, కొలతలు పకడ్బందీగా వేయడం, ఆధార్ ఫొటో, మొబైల్ నెంబర్లు వంటివి అనుసంధానించడం చేస్తున్నారు. దీనివల్ల ఒకరి భూమిని మరొకరు ఆక్రమించడం కుదరదు. మన భూమికి ఒక్కసారి ఎల్‌పీ నంబర్ వచ్చిందంటే ప్రపంచంలో మనం ఎక్కడున్నా మన భూమి భద్రంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



కంబదూరు మండలం చెన్నంపల్లి వద్ద రీ సర్వేను పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్

నాలుగు పేజీల్లోనే పూర్తి సమాచారం

గతంలో భూముల పాస్‌బుక్కులు ఎక్కువ పేజీలతో వచ్చేవి. తాజాగా రీసర్వే అనంతరం నాలుగు పేజీలతో కూడిన భూ యాజమాన్య హక్కు బుక్కు ఇచ్చి, అందులో సమగ్ర సమాచారం పొందుపరుస్తున్నారు. పాసు పుస్తకం ఇచ్చిన తేదీ మొదలుకొని భూహక్కుదారుడి పేరు, ఫొటో, ఊరు, కులం, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు ఉంటాయి. మూడవ పేజీలో భూమి ఎల్‌పీ నంబరు, విస్తీర్ణం, క్యూ ఆర్‌కోడ్ ఉంటాయి. అన్నింటికీ మించి భూమి విస్తీర్ణం సూచించే పటంతో సహా ఈ పేజీల్లో ఇవ్వడం గమనార్హం.

ఆక్రమణలకు అవకాశమే ఉండదు



మూడో దశలో మొత్తం 142 గ్రామాల్లో రీ సర్వే చేపడుతున్నాం. ఇప్పటివరకూ 27 గ్రామాల్లో పూర్తయ్యింది. మిగిలిన 115 గ్రామాలు 75 రోజుల్లో పూర్తి చేస్తాం. అదనపు రోవర్లు తెప్పించి సర్వే చేస్తున్నాం. చాలా గొప్ప ప్రాజెక్టు ఇది. భవిష్యత్‌లో భూ వివాదాలకు ఏ మాత్రమూ అవకాశం లేకుండా చేస్తున్న ప్రక్రియ ఇది.

–కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్



ఇక ఎన్నేళ్లయినా భూమి భద్రం



తాజాగా చేపట్టిన రీ సర్వేతో రైతులు, భూ యజమానులు నిశ్చింతగా ఉండచ్చు. చాలా పకడ్బందీ ప్రక్రియ ఇది. ఇప్పటికే రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శాశ్వత భూహక్కు పత్రాలు కూడా ఇస్తున్నాం. భవిష్యత్‌లో వివాదాలనేవి ఉండవు.

–విజయకుమార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, కూడేరు

ఆయుష్షు పెంచుతున్న 'ఆరోగ్య సురక్ష'



అనంతపురం శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు ముందస్తుగా అనారోగ్యాలను గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా ప్రజల ఆయుష్షును పెంచుతున్నాయి. స్పెషలిస్టు వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా కేంద్రం, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పది ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహించారు. 40 మంది స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, వందల సంఖ్యలో ఆరోగ్యశాఖ సిబ్బంది హాజరై 2,469 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 160 మందిని వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అనంతపురం కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, గార్లదిన్నె వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను పర్యవేక్షించారు.

నేడు 30 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలోని 30 ప్రాంతాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. పాల్తూరు, చింతకాయమంద, ఎల్లుట్ల, వెంకటాపపురం, అనంతపురం రూరల్, ఆత్మకూరు, బోరంపల్లి, భైరవాని తిప్ప, 75 వీరాపురం, వజ్రహొన్నూరు, 43 ఉడేగోళం, గంగవరం, బూదగవి, తిమ్మాపురం, ఇల్లూరు, పాళ్యం, ఆకులేడు, యర్రగుంటపల్లి, గుడిపాడు, అబ్బేదొడ్డి, వెంకటాంపల్లి, చాబాల, పాలికి, డీ హొన్నూరు, సోమలాపురం, మరూరులోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే అనంతపురం ఇందిరా గాంధీనగర్, కోర్టు రోడ్డు, గుత్తిలోని చెట్నేపల్లి, రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలుంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడువులోపు అర్జీలకు పరిష్కారం

- సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం
- 'స్పందన'లో 323 అర్జీలు



❐ అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామం సర్వే నంబరు 98–3ఎలో 64 సెంట్లు, 98–5లో 1.37 ఎకరాలు మొత్తం 2.01 ఎకరాలను తనకు 2013లో అప్పటి ప్రభుత్వం ఏడో విడత భూ పంపిణీలో కేటాయించిందని తిరుపాలు అనే దివ్యాంగుడు తెలిపాడు. అయితే పొలంలో ఈ క్రాప్ నమోదు చేయడం లేదని తెలిపాడు. ఇళ్ల స్థలాల కోసం ఆ భూమి తీసుకోనున్నట్లు వీఆర్వో చెప్పారని పేర్కొన్నాడు. తనకు పరిహారం లేదా మరొక చోట భూమి అయినా ఇవ్వాలని, లేకుంటే ఈ క్రాప్ నమోదైనా చేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించాడు.

అనంతపురం అర్బన్: వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలకు గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, సుధారాణి, శ్రీనివాసులు, డీపీఓ ప్రభాకర్‌రావు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 323 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు.



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ గౌతమి

అర్జీల్లో కొన్ని..

తమ భూమిని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన జింకల నాగలక్ష్మి కలెక్టర్‌కు అర్జీ అందజేసింది. సర్వే నంబరు 337–8లో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం 1988లో తన భర్తకు ఇచ్చిందన్నారు. భర్త మరణానంతరం ఆ భూమి తన పేరున మార్చారన్నారు. తమ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరింది.

- తమ స్థలాల్లో ఇళ్లు కట్టుకోకుండా కొందరు ఇబ్బంది పెడుతున్నారని అంగన్‌వాడీ వర్కర్లు జమున, నక్షత్ర, తదితరులు 'స్పందన'లో అర్జీ అందజేశారు. 2011లో ఉప్పరపల్లి పొలం సర్వే నంబరు 107/1 నుంచి 7 వరకు ఉన్న ప్రభుత్వ భూమిలో 1.50 సెంటు చొప్పున 69 మందికి ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. ఇళ్లు నిర్మించుకోవాలనుకున్న ప్రతిసారి ఎవరో ఒకరు వచ్చి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

- మాయమాటలతో విద్యార్థినిని తల్లిని చేసిన టీచర్
- ఈ నెల 14న మగబిడ్డకు జన్మనిచ్చిన బాలిక
- పోలీసుల అదుపులో నిందితుడు



తనకల్లు/అనంతపురం మెడికల్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని తల్లిని చేశాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సదరు బాలిక మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పూర్తి చేసింది. ఆ సమయంలో అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రెడ్డి నాగయ్య మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. కాగా.. బాలిక పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరినప్పటికీ కళాశాలకు సక్రమంగా వెళ్లలేదు. ఈ నెల 14న కడుపు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పింది. వారు తనకల్లు 30 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు ఇది కడుపు నొప్పి కాదని, పురిటి నొప్పులని చెప్పి అత్యవసరంగా కాన్పు చేశారు. మగబిడ్డను ప్రసవించింది. అయితే ప్రసవం అయ్యాక మావి బయటకు రాకపోవడం, రక్తస్రావం తదితర సమస్యలు తలెత్తడంతో తనకల్లు ఆస్పత్రి వైద్యులు అదే రోజు కదిరి ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు మావి తీసి ఓ యూనిట్ రక్తాన్ని అందించారు. రక్తహీనత ఉండడంతో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెఫర్ చేయగా, ఈ నెల 15న తెల్లవారుజామున 1.40 గంటలకు అక్కడ అడ్మిట్ చేశారు.

ఆధార్‌తో మైనర్‌గా గుర్తింపు

ఆమెకు వివాహం అయ్యిందని, వయసు 18 ఏళ్లు అని కేసు షీటులో నమోదు చేయించారు. కానీ సర్వజనాస్పత్రి వైద్యులకు అనుమానం వచ్చి ఆధార్‌కార్డు తీసుకురావాలని తల్లిదండ్రులకు చెప్పారు. సోమవారం ఆధార్ కార్డు తెచ్చివ్వగా.. బాధితురాలి వయసు 16 ఏళ్లుగా నిర్ధారణ అయ్యింది. దీంతో అక్కడి వైద్యులు కదిరి డీఎస్పీ శ్రీలత, తనకల్లు ఎస్ఐ రాజశేఖర్‌కు సమాచారం అందజేశారు. పోలీసులు అనంతపురం వెళ్లి బాలికతో పాటు తల్లిదండ్రులను విచారించి వివరాలను సేకరించారు. వారి ఫిర్యాదు మేరకు తెలుగు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.

అవినీతిపై విచారణకు సిద్ధమా?

- మాజీ మంత్రి కాలవకు పైలా నరసింహయ్య సవాల్



అనంతపురం కార్పొరేషన్: టీడీపీ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు సిద్ధమా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన, ప్రభుత్వంపైన ఇటీవల విమర్శలు చేయడాన్ని తప్పు పట్టారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పైలా మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుతున్నప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడం తద్వారా రాష్ట్ర ప్రజలకు నష్టం కల్గుతుందని తెలిసీ చేష్టలుడిగి చూశారని విమర్శించారు. హంద్రీ–నీవా ప్రాజెక్టుకు సంబంధించి 40 టీఎంసీలను 5 టీఎంసీలకు పరిమితం చేయాలని చూసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిందని గుర్తు చేశారు. గత టీడీపీ హయాంలో పోలవరం, అమరావతి, తాత్కాలిక సచివాలయ నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్ల పేరుతో సర్కారు సొమ్మును బందిపోటు దొంగల్లా టీడీపీ నాయకులు దోచేశారని విమర్శించారు. భారీ ఎత్తున అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారన్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకే ప్రజలు బ్రహ్మరథం పడతారని భావించిన మాజీ మంత్రి కాలవ ఫ్రస్ట్రేషన్‌లో సహనం కోల్పోయి ప్రభుత్వంపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిగా అవకాశమిచ్చినా జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని, ఆయన వ్యక్తిగతంగా వృద్ధి చెందడంపైనే శ్రద్ధ చూపించారని విమర్శించారు. వైద్యులు, జైళ్ల శాఖాధికారులు చంద్రబాబు ఆరోగ్యం బాగుందని చెబుతుంటే టీడీపీ నాయకులు ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సానుభూతి కోసం టీడీపీ ఎన్ని కుట్రలకు తెరలేపినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

చెనిక్కాయ.. సాగు తగ్గిపాయ!

- 50 ఏళ్ల చరిత్రలో తొలిసారి పడిపోయిన సాగు విస్తీర్ణం
- వివిధ రకాల పంటల సాగుకు శ్రీకారం
- అంచనాలకు మించి ఆముదం, మొక్కజొన్న, కంది పంటల సాగు
- 3.70 లక్షల హెక్టార్లకు గానూ 2.60 లక్షల హెక్టార్లలోనే 'ఖరీఫ్'



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో ప్రధాన పంటగా మారిన వేరుశనగ సాగుపై అర శతాబ్దం తర్వాత రైతులకు ఆసక్తి తగ్గింది. జిల్లాలో 2,31,151 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అధికారికంగా అంచనా వేయగా... చివరకు 41 శాతం అంటే 94,373 హెక్టార్లకే చెనిక్కాయ పరిమితమైంది. ఈ–క్రాప్ నమోదు పూర్తవడంతో పంటల వారీగా కచ్చితమైన సాగు విస్తీర్ణం వివరాలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం మీద అన్ని రకాల పంటలు సాధారణ సాగు 3,70,642 హెక్టార్లు అంచనా వేయగా... వర్షాభావ పరిస్థితులతో 70 శాతం విస్తీర్ణం అంటే 2,60,296 హెక్టార్లలో పంటలు వేశారు. ఒకట్రెండు పంటలకే పెద్దపీట వేయకుండా ఈసారి రైతులు పలు రకాలతో పంటల వైవిధ్యానికి శ్రీకారం చుట్టారు. ఇదొక శుభ పరిణామని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అంచనాకు మించి ఆముదం, మొక్కజొన్న, కంది

పెట్టుబడులు, కూలీల సమస్య కారణంగా కొన్నేళ్లుగా ప్రధానపంట వేరుశనగ సాగుపై రైతులు విముఖత ప్రదర్శిస్తున్నారు. దీంతో ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. దాని స్థానంలో అంచనాకు మించి అంటే సాధారణం కన్నా 225 శాతం అధికంగా ఆముదం, 238 శాతంతో మొక్కజొన్న, 182 శాతంతో కంది, 168 శాతంతో సజ్జ, 191 శాతంతో మినుము, 127 శాతంతో కొర్ర, 121 శాతంతో వరి పంటలు సాగు చేశారు. వేరుశనగతో పాటు నల్లరేగళ్లలో పత్తిని 61 శాతానికి తగ్గించారు. అలాగే పెసర, అలసంద, ఉలవ, రాగి, పొద్దుతిరుగుడు తదితర పంటలను కూడా బాగా తగ్గించినట్లు ఈ–క్రాప్ నమోదు నివేదిక స్పష్టం చేస్తోంది.

ఖరీఫ్‌లో పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)

పంట	సాధారణ సాగు విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం
వేరుశనగ	2,31,151	94,373
కంది	30,225	55,094
ఆముదం	12,463	28,060
మొక్కజొన్న	8,431	20,034
సజ్జ	1,355	2,487
కొర్ర	1,654	2,106
మినుము	166	318
పత్తి	51,612	31,235
వరి	17,440	21,145
జొన్న	7,041	2,508
పొద్దుతిరుగుడు	1,978	481
సోయాబీన్	491	332
ఉలవ	4,529	1,337
పెసర	1,598	303
అలసంద	298	195

క్లుప్తంగా

ఐఈఆర్పీ అభ్యర్థులకు నేడు నైపుణ్య పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయం సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ (ఎంఆర్, హెచ్ఐ/వీఐ) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నైపుణ్య పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించి అభ్యంతరాల నివృత్తి తర్వాత 1:3 నిష్పత్తిలో నైపుణ్య పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సమగ్రశిక్ష కార్యాలయంలో జరిగే నైపుణ్య పరీక్షకు అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది.

'పోలీసు స్పందన'కు 149 వినతులు



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 149 వినతులు అందాయి. ఈ మేరకు ఎస్పీ అన్బురాజన్ స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని అర్జీలు స్వీకరించారు. సమస్య తీవ్రతపై బాధితులతో ఆరా తీశారు. అనంతరం సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే సమస్యపై పదేపదే వినతులు అందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఇందిర, దిశ సీఐ చిన్నగోవిందు పాల్గొన్నారు.

వెదురు.. ఆదాయ వనరు

- ప్రైవేటు ఉద్యోగాన్ని వీడి వ్యవసాయంలో రాణిస్తున్న యువకుడు
- బల్‌కోవ, బయోమాస్క్ రకాల వెదురు సాగుకు శ్రీకారం





గొల్లపల్లి వద్ద సాగు చేసిన వెదురు పంట, బయోమాస్క్ వెదురు బొంగులను చూపుతున్న రైతు వంశీకృష్ణారెడ్డి

రాయదుర్గం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సమకూర్చే వినూత్న పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో వెదురుకు ఉన్న ఆదరణ, గిరాకీని దృష్టిలో ఉంచుకుని గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి ప్రయోగాత్మక సాగుకు శ్రీకారం చుట్టారు. దేశంలో వినియోగిస్తున్న వెదురు ఉత్పత్తుల అవసరాలకు ఈశాన్య రాష్ట్రాల్లో పండిస్తున్న వెదురు సరిపోవడం లేదు. దీంతో విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్లో 20 అడుగుల పొడవున్న వెదురు బొంగు రూ.100 నుంచి రూ.200 వరకూ ధర పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం సైతం నేషనల్ బ్యాంబూ మిషన్ ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా వెదురు సాగును ప్రోత్సహిస్తోంది.

జిల్లాలో మొట్టమొదటగా గొల్లపల్లిలో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొట్టమొదటి సారిగా గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో 10 ఎకరాల్లో బల్‌కోవ, బయోమాస్క్ రకాలకు చెందిన వెదురు సాగులో ఉంది. గ్రామానికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి బళ్లారి జిల్లా తొరణగల్లులో ఉన్న జిందాల్ పరిశ్రమలో ఉద్యోగం చేసేవారు. నెలకు రూ.40 వేలు వేతనం అందేది. కరోనా కారణంగా పరిశ్రమ మూతపడడంతో విధిలేని స్థితిలో స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇంటి పట్టునే ఖాళీగా ఉండలేక వ్యవసాయంపై దృష్టి సారించారు. అందరిలా సాధారణ పంట కాకుండా వినూత్నంగా ఏదైనా సాగు చేయాలని భావించిన ఆయన.. కర్ణాటక ప్రాంతంలో విస్తరిస్తున్న వెదురు సాగుపై ఆసక్తి పెంచుకుని, ఆ ప్రాంత రైతులను కలసి అవగాహన పెంచుకున్నారు. అనంతరం తమిళనాడులోని హొసూరు ప్రాంతం నుంచి రూ.2 లక్షల వ్యయంతో 10 వేల వెదురు పిలకలు (బల్‌కోవ, బయోమాస్క్ రకం) కొనుగోలు చేసి, తనకున్న పది ఎకరాల్లో సాగు చేపట్టారు. మరో పది నెలల్లో పంట కోతకు రానుంది.

నేల ఆరోగ్యం బాగు



ఏడాదికి ఎకరా విస్తీర్ణంలో 4 టన్నుల ఆకు రాలుతుంది. ఇది సహజ ఎరువుగా మారి నేల ఆరోగ్యాన్ని పెంచుతుంది. ఒక్కొక్క వెదురు చెట్టు 50 వేల లీటర్ల నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కలిగి ఉండడంతో భూగర్భజలాలూ పెరుగుతాయి. త్వరలో రైతు వంశీకృష్ణారెడ్డి పొలం వద్దనే వెదురు సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబోతున్నాం. – రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, అనంతపురం

పెట్టుబడి తక్కువ...



ఎకరాకు 450 మొక్కలు నాటితే నాలుగేళ్ల తర్వాత 4 వేల బొంగులు చేతికి వస్తాయి. ఆ తర్వాత ఏటా పిలకలు పెరిగి బొంగుల సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతాయి. మొదట్లో మొక్కల కొనుగోలు, రవాణా, నాటడం, వేసవిలో నీటితడులు అందించి కాపాడటానికి మాత్రమే ఖర్చుచేయాలి. పొలం చుట్టు కంచె, బిందు, సేద్య పరికరాలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. రెండో ఏడాది నుంచి పెట్టుబడులు, కూలీల ఖర్చులు ఉండవు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ అవసరం లేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్దగా నష్టమూ ఉండదు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయమూ ఉంటుంది. మరో 10 ఎకరాల్లో వెదురు సాగుకు నేలను సిద్ధం చేశా. ఈ పంట చూసి దాదాపు 20 మంది రైతులు సాగుకు సిద్ధమయ్యారు. – పాటిల్ వంశీకృష్ణారెడ్డి, రైతు, గొల్లపల్లి

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రారంభం

- పరిశీలించి సూచనలిచ్చిన కలెక్టర్ గౌతమి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) డీఆర్ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ సోమవారం పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాము వద్ద పటిష్ట బందోబస్తు మధ్య ప్రారంభమైంది. ఈ ప్రక్రియను కలెక్టర్ గౌతమి పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. పొరపాట్లకు తావివ్వకుండా ఎఫ్ఎల్‌సీ జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి నవంబరు 10వ తేదీ వరకూ ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రక్రియ పూర్తయ్యే వరకూ నిరంతర పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా కొనసాగాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, తహసీల్దారు శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆముదం ఇగురు తిని గొర్రెలు మృతి



రాయదుర్గం రూరల్: ఆముదం పంట ఇగురు తిన్న పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రాయదుర్గం మండలం ఆర్‌బీ వంక (బొందనకల్లు) గొల్లలదొడ్డిలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాపర్లు గొల్ల తిప్పేస్వామి, గొల్ల రుద్రన్న తమ జీవాలను సోమవారం ఉదయం మేపునకు అటవీ శివారు ప్రాంతానికి తోలుకెళ్లారు. మార్గమధ్యంలో ఆముదం పంటలోకి చొరబడిన గొర్రెలను అదలించుకుని వచ్చే లోపు ఇగురు తిన్నాయి. కాసేపటి తర్వాత పది గొర్రెలు మృతి చెందగా మరి కొన్ని అస్వస్థతకు లోనయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్య సిబ్బంది అక్కడకు చేరుకుని చికిత్స చేయడంతో అస్వస్థతకు లోనైన గొర్రెలు కోలుకున్నాయి. గొర్రెల మృతితో రూ.1లక్ష మేర నష్టం వాటిల్లినట్లు ఈ సందర్భంగా కాపరులు వాపోయారు.

రూ.1,800 కోట్లకు చేరిన డీసీసీబీ టర్నోవర్

- అభినందనలు తెలిపిన చైర్‌పర్సన్ లిఖిత



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువగా డీసీసీబీ టర్నోవర్ చేరుకోవడంపై ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలాఖరుతో ముగిసిన ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి రూ.1,800 కోట్ల టర్నోవర్ సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక డీసీసీబీ హాలులో 28 బ్రాంచి మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రగతి పథంలో నడుస్తున్న డీసీసీబీని ఇటీవల రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీకే) బలహీన బ్యాంకుల జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో డీసీసీబీ ఆర్థిక పురోగతి దిశగా పయనిస్తోందన్నారు. రెండో త్రైమాసికం ముగిసేసరికి రూ.1,800 కోట్ల మార్క్‌ను అధిగమించి డిసెంబర్ నెలాఖరుకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించే దిశగా పయనిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరిస్తున్న బ్యాంకు పాలకవర్గం, అధికారులు, బ్రాంచి మేనేజర్లను అభినందించారు. భవిష్యత్తులో వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎం రవికుమార్, నాబార్డు డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కాలేజ్ రోడ్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర రెడ్డి సోమవారం ప్రారంభించారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ... రైతుల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగనన్న ఎన్నో మంచి పనులు చేశారని కొనియాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి అన్ని రకాల రైతు సేవలను చేరువ చేశారన్నారు. అంతేకాక పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు పగటి పూట 9 గంటల పాటు ఉచితంగా నిరంతర విద్యుత్ సరఫరాకూ చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీటీ హయాంలో కనీసం 2 గంటలు కూడా రైతులకు విద్యుత్ సరఫరా చేసింది లేదన్నారు. రానున్న రోజుల్లో టమాట పంటను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులోకి తెస్తామన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. .రైతుల కోసం కల్తీ లేని ఎరువులను సరఫరా చేసేందుకు ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కృష్ణప్ప, బ్రాంచ్ మేనేజర్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సర్వోత్తం, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ అర్చన, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా


- డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



కంటి వైద్య చికిత్సలపై ఆరా తీస్తున్న డాక్టర్ భ్రమరాంబదేవి

గార్లదిన్నె: ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసానిచ్చారని, ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. సోమవారం గార్లదిన్నె సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. టోకన్ల మంజూరు, స్పాట్ రిజిస్ట్రేషన్లు, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో మెరుగైన వైద్యం కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేక చాలా మంది అనారోగ్యంతోనే సతమతమయ్యేవారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు, చికిత్స చేసి, మందులూ అందజేస్తున్నారన్నారు. అనంతరం అవ్వాతాతలకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. అంతకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సబ్బమ్మ, ఉప సర్పంచ్ షెక్షావలి, జంబులదిన్నె సొసైటీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్లు, ప్రత్యేక వైద్య నిపుణులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో వలంటీర్ మృతి



మధుసూదన్ (ఫైల్)

ముదిగుబ్బ: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి చెందిన తొండూరు మధుసూదన్(33)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పాడి పోషణతో పాటు గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఆరు గంటలకు తన ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఆవు పాలు పితుకుతుండగా అది కాలితో తన్నింది. దీంతో మధుసూదన్ రేకుల షెడ్‌కు ఏర్పాటు చేసిన ఇనుప పైపునకు తగిలాడు. పైపునకు అమర్చిన స్విచ్‌బోర్డు నుంచి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆహార సూచిలో అగ్రగామిగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ రంగ జనార్దన, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, తదితరులు

అనంతపురం: ఆహార సూచిలో మన దేశం అగ్రగామిగా ఉండేలా వినూత్న పరిశోధనలు సాగించాలని ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆచార్యులకు జేఎన్‌టీయూ(ఏ) వీసీ ఆచార్య జింకా రంగజనార్దన సూచించారు. జేఎన్‌టీయూ (ఏ)ఓటీపీఆర్ఐలో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం 'ప్రపంచ ఆహార దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆహార కొరత నివారించి, ఆహార సమృద్ధి పెంపొందించడంలో హరిత విప్లవ పాత్రను వివరించారు. చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరగాలన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అనాథ శరణాలయానికి నిత్యావసర సరుకులు వితరణ చేశారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ ఎ.స్వరూపరాణి, సదస్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ఎం జబీన్, మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం

విభాగం	విజేత	రన్నరప్
అండర్ 11 (బాలికలు)	స్ఫూర్తి నయన	ఎస్.మనస్వి
అండర్ 11 (బాలురు)	ఎన్.వేదాన్స్	జి.తరుణ్‌తేజ్
అండర్ 13 (బాలికలు)	ఎం.శ్రీశాన్వి	పి.ధ్రుతి
అండర్ 13 (బాలురు)	పి.అశ్విన్	పి.జతిన్‌రెడ్డి
అండర్ 15 (బాలికలు)	ఎం.శ్రీశాన్వి	పి.సంహిత
అండర్ 15 (బాలురు)	త్రిషాల్ రాజ్‌కుమార్	టి.సందేహి
అండర్ 17 (బాలికలు)	జి.సిరిపావని	శ్రీశాన్వి
అండర్ 17 (బాలురు)	మహిధర్ వర్మ	త్రిషాల్ రాజ్‌కుమార్



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం సాధ్యమని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి అన్నారు. ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండ్ స్టేట్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో భాగంగా ఆదివారం అనంత క్రీడాగ్రామంలోని ఇండోర్ స్టేడియంలో ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో విజేతలను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామలక్ష్మి హాజరై, బహుమతులు అందజేసి, మాట్లాడారు. రాష్ట్రస్థాయి టీటీ పోటీల నిర్వహణకు సహకరించిన ఆర్డీటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీటీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.అక్బర్‌సాహెబ్, జిల్లా అధ్యక్షుడు బి.మురళీధరరావు, కార్యదర్శి పి.కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి దుర్మరణం



మృతుడు నరసప్ప

రొళ్ల: వెనుక నుంచి వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామానికి చెందిన నరసప్ప (65) సోమవారం ఉదయం తన పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా రొళ్ల వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన మినీ లారీ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రొళ్ల ఎస్ఐ మధురామచంద్రుడు, పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీ డ్రైవర్ సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మినీ లారీ డ్రైవర్ సంజీవరెడ్డి స్వగ్రామం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి. మినీ లారీని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బాడుగ నిమిత్తం కర్ణాటకలోని మంగళూరుకు వెళ్లిన ఆయన అక్కడ సరుకు అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. హొట్టేబెట్ట వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక నరసప్పను ఢీకొన్నట్లుగా తెలిసింది. మృతుడికి భార్య నాగలక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో ఎమ్మెల్సీని ఉమ్మడి అనంతపురం జిల్లా పీఆర్టీయూ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ పరిష్కరించేలా చూడాలని విన్నవించారు. నూతన పీఆర్సీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించేలా చూడాలన్నారు.

రూ.180 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యాడికి: రాయలచెరువు గ్రామంలో చందన, యాడికి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న రైల్వే గేట్‌ను తొలగించి, దాదాపు రూ.180 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు మంజూరైనట్లు రైల్వే ఈఈ ప్రసాద్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ రమణ, తహసీల్దార్ అలెగ్జాండర్ తెలిపారు. సోమవారం మండలంలోని రాయలచెరువులో ఉన్న రైల్వే గేట్లను రైల్వే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో రైల్వే డీఈ శ్రీధర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ నరసయ్య, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వీఆర్వో కుమార్ రులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

గుత్తి రూరల్: స్థానిక పెండేకల్లు రైలు మార్గంలో బసినేపల్లి తండా వద్ద రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆదివారం అర్ధరాత్రి రైల్వే కీమెన్ గుర్తించి, సమాచారం అందించడంతో సోమవారం ఉదయం రైల్వే ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు. కాగా, సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థికి అధికారుల అభినందన

పుట్టపర్తి అర్బన్: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలకు ఎంపికైన లేపాక్షి మండలం పులమతి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రహీంను సోమవారం శ్రీసత్యసాయి జిల్లా అధికారులు అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రహీం ఆవిష్కరణ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విషయం తెలుసుకున్న ఆ జిల్లా ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి తదితరులు సోమవారం రహీంను అభినందించారు.

క్లుప్తంగా

విద్యుత్‌శాఖ ఏఈకి సన్మానం



ఏఈ నాగరాజును సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం టౌన్: నగరంలోని బళ్లారిరోడ్డు డీ–5 సెక్షన్ ఏఈ నాగరాజును సోమవారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఏడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద సబ్ స్టేషన్‌గా ఉన్న డీ–5 సెక్షన్‌లో సమస్యలపై వినియోగదారులు ఫోన్ చేసిన వెంటనే నాగరాజు స్పందించేవారన్నారు. ఏఈ రామాంజనేయులు, కాంట్రాక్టర్లు మాధవరెడ్డి, బాబు, సుధీర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

ధర్మవరం అర్బన్: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడిని రైల్వే జీఆర్‌పీ పోలీసులు బాలుడి తల్లికి అప్పగించారు. ధర్మవరం రైల్వే ఆర్‌పీ ఎస్‌ఐ గోపికుమార్, హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖానందరెడ్డి తెలిపిన మేరకు.. అనంతపురం పట్టణానికి చెందిన కుమార్ అనే బాలుడు ఇంట్లో రూ.16 వేల నగదు తీసుకుని సెల్‌ఫోన్ కొన్నందుకు తల్లి సునీత మందలించింది. దీంతో ఆదివారం అనంతపురం నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లాలని గుంతకల్లులో దిగాడు. అక్కడి నుంచి హంపి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో దిగాడు. ఫ్లాట్‌ఫారంపై తచ్చాడుతూ తిరుగుతున్న కుమార్‌ను పోలీసులు విచారించగా ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు తెలిపాడు. దీంతో తల్లి సునీతకు ఫోన్ చేసి రమ్మని చెప్పి బాలుడిని అప్పగించారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి



ప్రొఫెసర్ అనితను సన్మానిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎస్కేయూ పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ కే అనిత (అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ)ను వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సోమవారం కోరారు. పాలకమండలిలో 50 శాతం మహిళలతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ కేటగిరీలకు 50 శాతం పైగా స్థానాలను కట్టబెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఆమెను వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పి. హేమంత్ కుమార్, వాసు, శివ, పూర్ణ చంద్ర, అనిల్, కేశవ, నవీన్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం క్రైం: స్థానిక నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, నీరు–ప్రగతి పార్క్ సమీపంలో పేకాట ఆడుతుండగా పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.47,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో పురుషోత్తం, అమర్నాథ్, మల్లికార్జున, వెంకటనారాయణ, హరిప్రసాద్, అమీర్, గోపాల్, రవీంద్ర, బాబయ్య, రాజారెడ్డి ఉన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీ



కృత్రిమ కాలు అందిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఇద్దరు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు (ఆర్టిఫిషియల్ లెగ్స్)ను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ వీటిని అందించారు. రూ.8వేలు విలువ చేసే ఒక్కో కృత్రిమ కాలును తాడిపత్రి పట్టణం రాగితోటపాల్యం వీధికి చెందిన టి.హుసేన్‌కు, చిత్తూరు జిల్లా మదనపల్లి పట్టణం పుంగనూరు రోడ్డులోని రెడ్డి సులేమాన్‌కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఆర్థోటిస్ట్ నాగముని, తదితరులు పాల్గొన్నారు.

అండర్–23 క్రికెట్ ప్రధాన కోచ్‌గా కేఎస్ షాబుద్దీన్

అనంతపురం: 2023–24 సీజన్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అండర్–23 క్రికెట్ పురుషుల జట్టు ప్రధాన కోచ్‌గా కేఎస్ షాబుద్దీన్ నియామకయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన షాబుద్దీన్ 83 రంజీ మ్యాచ్‌లు ఆడి, 3వేల పరుగులు సాధించారు. 248 వికెట్లు తీసి, ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ముంబాయి ఇండియన్స్ ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉంది. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కోచ్‌గా సిఫార్సు చేసింది.

- అండర్–23 త్వరలో ఛండీఘడ్‌లో నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు అనంతపురం జిల్లా నుంచి జి. మల్లికార్జున, బి. సంతోష్ ఎంపికయ్యారు. లెఫ్ట్‌ఆర్మ్‌స్పిన్నర్ జి. మల్లికార్జున, లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ బి. సంతోష్ ప్రాతినిధ్యం వహించనున్నారు.



తపోవనంలో వేదమాత గాయత్రీదేవి



శంకర మఠంలో శారదామాత



కొత్తూరు అమ్మవారి శాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న స్పెయిన్ దేశస్తులు



సాయినగర్ నాల్గో క్రాస్‌లో గాయత్రీదేవి అలంకరణ



మున్సిపల్ కాంప్లెక్స్‌లో గాయత్రీదేవి

భక్తిపరవశం.. గాయత్రీదేవి దర్శనం



పాతూరులో చౌడేశ్వరి ఆలయంలో గజలక్ష్మి అలంకరణ



పాతూరు అమ్మవారి శాలలో గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు



హెచ్చెల్సీకాలనీ ముత్యాలమ్మ ఆలయంలో లలితాదేవి అలంకరణ



అంతర గంగప్ప స్వామి గుడి వద్ద గాయత్రీదేవి అలంకరణ

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కొత్తూరులో వైష్ణవీదేవిగా, పాతూరులో గాయత్రీదేవి దర్శనమిచ్చారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శారదామాత నందివాహనంపైన, సుభాష్‌రోడ్డు అర్బన్ బ్యాంకు వద్ద గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రాయలసీమ కోఆపరేటివ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు అమ్మవారిని దర్శించుకున్నారు. బాలయోగి ఆశ్రమంలో కామాక్షిదేవిగా, శంకరమఠంలో శారదాదేవి వృషభ వాహనంపై దర్శనమిచ్చారు. హెచ్చెల్సీ కాలనీ, సాయినగర్ కనకదుర్గ ఆలయం, గుత్తిరోడ్డులోని చంద్రగుత్తి ఎల్లమ్మ తల్లి, శివకోటి, తపోవనం గాయత్రీమాత ఆలయంలో వేడుకలు జరిగాయి.

అనంతపురం అర్బన్: పాతూరు చెరువు కట్ట మీద కొలువై ఉన్న కొత్తకోట సుంకలమ్మకు పూజారమ్మ బెస్తవరలక్ష్మి పూజ చేశారు. అమ్మవారు కుందన్ అలంకరణలో దర్శనమించారు.

గాయత్రీ దేవిగా పార్వతి దేవి

రాప్తాడు: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పార్వతి దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రీదేవిగా పార్వతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

ఆత్మకూరు: వడ్డుపల్లి, ఆత్మకూరు అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వడ్డుపల్లిలోని సుంకలమ్మ , ఆత్మకూరు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు.

హంస వాహనంపై శ్రీనివాసుడి విహారం

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై హంస వాహనంపై సోమవారం విహరించారు. రాంనగర్‌లో, హౌసింగ్ బోర్డుల్లోని వేంకటేశ్వరాలయాల్లో బ్రహ్మోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి.




కొత్తూరు అమ్మవారి శాలలో అద్దాలతో అమ్మవారికి అలంకరణ



కుందన్ అలంకరణలో కొత్తకోట సుంకులమ్మ



పాతూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పాతూరులో ముత్యాలు, బటన్‌లతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం



కమలానగర్‌లో అమ్మవారి అలంకరణ



ఆత్మకూరులో గాయత్రీదేవి అలంకరణ

రాబోవు కాలంలో విప్లవాత్మక మార్పులు



పూర్వ విద్యార్థి శ్రీ వత్సన్ వరదన్‌ను సన్మానిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన

అనంతపురం: రాబోవు కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్‌తో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని శ్రీవత్సన్ వరదన్ (1979–83 బ్యాచ్ పూర్వ విద్యార్థి) అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ' ఎక్స్‌పెక్టేషన్ ఆఫ్ ఇండస్ట్రీ మేనేజర్స్ ఫ్రమ్ ఎంట్రీ లెవల్ ఇంజినీర్స్ అండ్ కాంపిటెన్సీ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫారిన్ అఫైర్స్ , అల్యూమ్నీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి. నారాయణ రెడ్డి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

- కిమ్స్ సవీరా ఆసుపత్రి సహకారంతో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో అవేర్‌నెస్ ఆన్ బ్రెస్ట్ కేన్సర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్సిటీ డైరెక్టర్ పి. సుజాత హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ మహిళా సాధికారిత డైరెక్టర్ ప్రొఫెసర్ వీబీ చిత్ర తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలు పరిష్కరించాలి



సమీక్షలో పాల్గొన్న సర్వే భూరికార్డుల శాఖ ఏడీ

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ ఆ శాఖ అధికారులు, సర్వేయర్లను ఆదేశించారు. కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై ఏడీ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులు, సర్వేయర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సర్వే అర్జీలను పరిష్కరించే క్రమంలో అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. సూపరింటెండెంట్ అయూబ్, జిల్లా ఇన్‌స్పెక్టర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరం అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, అరవిందనగర్ శ్రీ కృష్ణదేవరాయ పాఠశాలలో వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల పరీక్షలు 172 రకాల మందులు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మంచి మనసున్న నాయకుడు సీఎం కుర్చీలో కూర్చుంటే పరిపాలన ఎలా ఉంటుందో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్నారన్నారు. గతంలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి రూ.లక్షలు అప్పులు చేసి, వైద్య చికిత్సలు పొందాల్సి వచ్చేదన్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు నాగవినుత, సాకే చంద్రశేఖర్, నాయకులు సుకేష్, జానీ పాల్గొన్నారు.

స్కాంల ఆద్యుడు చంద్రబాబు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు స్కాంలకు ఆద్యుడిగా నిలిచారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. సోమవారం కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో అక్రమాలు బయటపడి బాబు జైలుకెళితే ఆయన కుటుంబ సభ్యులు, నేతలు సానుభూతి కోసం రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అవినీతి చేసి జైలు జీవితం గడుపుతున్న చంద్రబాబు చట్టానికి అతీతులా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. స్కిల్ కేసులో బెయిల్‌కు పయత్నం చేయకుండా క్వాష్ కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్కిల్ స్కాం 2017లోనే వెలుగు చూసిందని, పక్కా ఆధారాలు ఉండడంతోనే అధికారులు అరెస్టు చేశారన్నారు. ఈ స్కాంలో లోకేష్ భాగస్వామి అని ఆరోపించారు.

కేసీఆర్ ప్రశంసలు: ఏపీలో అమలు చేస్తున్న పింఛన్ విధానాన్ని, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రశంసించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

నేడు పలుచోట్ల సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, అశోక్‌నగర్ సాయిబాబా పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. 25, 36 సచివాలయాల పరిధిలోని గుల్జార్‌పేట, ఆదిమూర్తినగర్, అశోక్‌నగర్, డ్రైవర్స్ కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు ఆరోగ్య సురక్ష

ఆత్మకూరు: స్థానిక కనకదాస కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు.

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో మంగళవారం గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ తెలిపారు.

అక్కులప్ప కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా

రాప్తాడురూరల్: అక్కులప్ప కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా కల్పించారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికి చెందిన అభిలాష్ (28) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన బోయ అక్కులప్ప, బొమ్మక్క దంపతుల కుమారుడు అభిలాష్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎమ్మెల్యే సూచనలతో అతన్ని పాండిచ్చేరిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అక్కడ నయం కాకపోవడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి విషమించినట్లు తెలపడంతో ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం అతను మృతిచెందగా, ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని అభిలాష్ మృతదేహానికి నివాళులర్పించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, నాయకులు ఉన్నారు.



అభిలాష్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కలెక్టరేట్ వద్ద క్లాప్ మిత్రల ధర్నా

అనంతపురం అర్బన్: బకాయి వేతనాన్ని పంచాయతీలు చెల్లించాలని ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు (క్లాప్ మిత్రలు) కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎల్‌వీ సుధీర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగముత్యాలు, కిశోర్, దుర్గేష్, రుద్రప్ప, కార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి చేయూత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి బి.అక్కులప్ప రూ.15 వేలు విలువ చేసే పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి సోమవారం అందించారు. అక్కులప్ప ఎస్కేయూలో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం పోస్టల్ విభాగంలో జీడీఎస్‌గా పని చేస్తున్నారు.

శరవేగం..చెరువుకట్ట రోడ్డు నిర్మాణం

- రూ.30 లక్షలతో పనులు ప్రారంభం
- ఎంపీ రంగయ్య, కలెక్టర్ గౌతమి చొరవతో పనులు శరవేగం

అనంతపురం సిటీ: కలెక్టరేట్ ఎదుట ఉన్న చెరువుకట్టపై రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంపీ రంగయ్య, కలెక్టర్ గౌతమి చొరవతీసుకొని అత్యవసరంగా రూ.30 లక్షలు మంజూరు చేయించారు. పనులు యుద్ధప్రాతిపదికన మొదలుపెట్టేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కడప, తాడిపత్రి, బెంగళూరు తదితర నగరాలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు అనంతపురం నగరంలోకి ప్రవేశించకుండా చెరువుకట్ట మీదుగా సాఫీగా రాకపోకలు సాగించేవి. ధ్వంసమైన రహదారిని నిర్మించేందుకు టీడీపీ హయాంలో అప్పటి నేతలు పట్టించుకున్న పాపాన పోలేదు. చెరువుకట్టపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. మరెందరో శాశ్వత వికలాంగులుగా మారారు. జెడ్పీ కార్యాలయం డీపీఆర్‌సీలో ఇటీవల నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం దృష్టికి చెరువుకట్ట రోడ్డు దుస్థితిపై దిశ కమిటీ సభ్యుడు లింగాల రమేష్ తెచ్చారు. కమిటీ చైర్మన్/ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ ఎం.గౌతమి వెంటనే స్పందించి, రూ.30 లక్షలు విడుదల చేయించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.



చెరువు కట్ట వద్ద రోడ్డు పనులు పరిశీలిస్తున్న దిశా కమిటీ సభ్యుడు లింగాల రమేష్

అత్యవసరంగా భావించాం



ట్యాంక్ బండ్ రోడ్డు సమస్యను సీరియస్‌గా తీసుకున్నాం. వెంటనే రూ.30 లక్షలతో పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. 250 మీటర్ల మేర రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేలా ఆదేశాలిచ్చాం. చెరువుకట్ట రోడ్డు ఎంతో ప్రాధాన్యం కలిగింది. ఈ రోడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధికి చర్యలు చేపడతాం.

– ఎం.గౌతమి, కలెక్టర్, అనంతపురం

ప్రజల ప్రాణాలే ముఖ్యం



చెరువుకట్ట రోడ్డు అధ్వానంగా తయారుకావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రమాదాలకు గురయ్యారు. కొందరు చనిపోగా, మరికొందరు వికలాంగులయ్యారు. ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం. దిశ సమావేశంలో ట్యాంక్‌బండ్ రోడ్డు దుస్థితిపై చర్చించాం. భవిష్యత్‌లో చెరువుకట్ట (ట్యాంక్‌బండ్) అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– తలారి రంగయ్య, ఎంపీ, అనంతపురం

ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

అనంతపురం కల్చరల్: ఆలయాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్ అన్నారు. సోమవారం పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, పోతుల సురేష్, రమేష్‌గౌడ్, తిరువీధుల జగదీష్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జయంతి వేంకటేశ్వర్లు, సత్రసాల మంజునాథ్ తదితరులు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాలవారికి ఆలయ ధర్మకర్తల మండలిలో అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం కలవల సతీష్‌కుమార్, ఇతర సభ్యులను సత్కరించారు.

సభ్యుల ప్రమాణ స్వీకారం..
ఆలయ చైర్మన్‌గా కలవల సతీష్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులుగా జవారిటక్ మీనా, ముచ్చుకోట నరసింహులు, నగేష్‌కుమార్, వాసంతి, భావన, తులసితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అర్చకుడు నిఖిల్ నారాయణతో ఆలయ ఈవో బీఆర్ వెంకటేశులు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కొత్తూరు, పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు, పిన్ని నాగరత్నం, నాగభూషణ, తల్లం మురళీ తదితరులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.



విరూపాక్షేశ్వర ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

నేటి నుంచి గ్యార్మీ వేడుకలు

అనంతపురం కల్చరల్: మాబుసుబానీ (దస్తగిరి స్వామి) గ్యార్మీ వేడుకలు మంగళవారం నుంచి పది రోజుల పాటు జరగనున్నాయి. శ్రీనివాసనగర్ సమీపంలోని షాహే గౌసే ఆజం ఆసార్ దర్గాలో వేడుకల వివరాలను కమిటీ సభ్యులు కమిటీ షబ్బీర్ అహ్మద్, సెక్రటరీ, నవీద్, అబ్దుల్ సమీ తెలిపారు. ఈనెల 17 నుంచి 26 వరకు ఉత్సవాలు ఉంటాయని, 27న ఉరుసు ఉత్సవం జరుగుతుందన్నారు.

కుర్లపల్లిలో నీటి సమస్య పరిష్కరిస్తాం

ఆత్మకూరు: కుర్లపల్లిలో నీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ రఘునాథ్, ఎంపీపీ హేమలత తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కుర్లపల్లి గ్రామస్తులతో కలిసి సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఎంపీడీఓ, ఎంపీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వాణి కలిసి గ్రామానికి వెళ్లి సమస్యపై ఆరాతీశారు. గ్రామంలో బోరు వేసేందుకు స్థలం పరిశీలించారు. నాయకులు వన్నూరప్ప, ఆంజినప్ప పాల్గొన్నారు.